

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అల్లూరి సీతారామరాజు జిల్లా వార్తలు
సోమవారం 20 మే 2024



ఆంధ్ర కశ్మీర్ లంబసింగికి సమీపంలోని చెరువులవేనంలో మండు వేసవిలోనూ మంచు అందాలు సందర్శకులను అలరిస్తున్నాయి. గిరిజన ప్రాంతంలో పది రోజులుగా తొలకరి వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. వారం రోజులుగా చెరువులవేనం, లంబసింగిలో మంచు అందాలు ఆవిష్కృతమవుతున్నాయి. దీంతో పర్యాటకులు ఇక్కడికి క్యూ కడుతున్నారు. ఆదివారం ఉదయం పదుల సంఖ్యలో పర్యాటకులు చెరువులవేనం చేరుకుని శ్వేత వర్ణంలో దట్టంగా పరుచుకున్న మంచు మేఘాలను చీల్చుకుని బయటకొస్తున్న సూర్యోదయాన్ని వీక్షించి పరవశించిపోయారు. - చింతపల్లి

సప్తవర్ణ శోభితం



పాడేరు శివారున దర్శనమిచ్చిన ఇంద్ర ధనుస్సు

జిల్లా కేంద్రం పాడేరులో ఆదివారం మధ్యాహ్నం వర్షం కురిసి వెలిసిపోయిన తరువాత ఇంద్ర ధనుస్సు దర్శనమిచ్చింది. పాడేరు తూర్పు కొండల వైపు ఏర్పడిన ఇంద్ర ధనుస్సు అందర్నీ విశేషంగా ఆకర్షించింది. దీంతో దానిని కెమెరాల్లో బంధించేందుకు జనం పోటీ పడ్డారు. - ఆంధ్రజ్యోతి/పాడేరు

మంచు సోయగం



అలరిస్తున్న చెరువులవేనం మంచు అందాలు

పాడేరులో పండగ సందడి

ఉత్సవాలు వాయిదా పడినా అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

» వేసవి, ఉత్సవాల నేపథ్యంలో పాడేరులో కోలాహలం



మోదకొండమ్మను దర్శించుకుంటున్న భక్తులు

పాడేరు, మే 19(ఆంధ్రజ్యోతి):

ఈనెల 19, 20, 21 తేదీల్లో జరగాల్సిన మోదకొండమ్మ ఉత్సవాలు ఎన్నికల కోడ్ నేపథ్యంలో వచ్చే నెలకు వాయిదా పడినప్పటికీ ఆదివారం మాత్రం పాడేరులో పండగ సందడి నెలకొంది. వాస్తవానికి ఆదివారం నుంచి ఉత్సవాలు ప్రారంభంకానుండడంతో వారం, పది రోజుల కిత్రమే వివిధ ప్రాంతాల్లో ఉన్న స్థానికుల బంధువులు ఇక్కడికి వచ్చారు. అలాగే వారి మొక్కులను సైతం తీర్చుకున్నారు.

ఉత్సవాల సమయంలో అమ్మవారిని దర్శించుకోవాలని ప్రతి భక్తుడు భావిస్తాడు. దీంతో అధికారికంగా ఉత్సవాలు వాయిదా పడినప్పటికీ స్థానికంగా ఉన్న భక్తులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మోదకొండమ్మ దర్శనానికి ఎగబడ్డారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆలయం లోపల నుంచి రోడ్డుపైకి సైతం భక్తులు వరుస కట్టారు. అలాగే మొక్కలున్న భక్తులు ఘటాలను అమ్మవారికి సమర్పించారు. దీంతో పాడేరు పట్టణంతో పాటు మోదకొండమ్మ ఆలయం ఆవరణలోనూ ఆధ్యాత్మిక సందడి నెలకొంది. భక్తులకు ఆలయ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు ప్రత్యేకంగా ప్రసాదాలు పంపిణీ చేశారు.





మోదకొండమ్మ దర్శనానికి ఆలయం ముందు బారులుతీరిన భక్తులు


కిటకిటలాడిన పట్టణ వీధులు

ఉత్సవాల కోసం వివిధ ప్రాంతాల నుంచి చిరు వర్తకులు ఇప్పటికే పాడేరు చేరుకున్నారు. ఉత్సవాలు వాయిదా పడినప్పటికీ కొందరు ఇక్కడే ఉండిపోయి తమ దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారు. దీంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆయా దుకాణాల్లో తమకు అవసరమైన వస్తువులను కొనుగోలు చేస్తున్నారు. పట్టణం వీధుల్లో సైతం జనంతో పండగ హడావిడి నెలకొంది. ఎన్నికల కోడ్ అతిక్రమించకుండా, ఎటువంటి శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీసులు అవసరమైన జాగ్రత్తలు తీసుకున్నారు.

జల విద్యుత్ కేంద్రానికి తప్పిన పెను ముప్పు

వాల్వ్‌లోకి భారీగా ప్రవేశించిన నీరు

ప్రాజెక్టు ఇంజనీర్లు, సిబ్బంది అప్రమత్తతతో తప్పిన ప్రమాదం



నాల్గవ నంబరు వాల్వ్‌లోకి నీరు ప్రవేశించిన దృశ్యం

ముంచంగిపుట్టు, మే 19: ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రానికి పెనుముప్పు తప్పింది. శనివారం రాత్రి ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. దీని వల్ల వినియోగంలో ఉన్న నాలుగు జనరేటర్లు ఒక్కసారిగా కుప్పకూలిపోయాయి. వాటిని వినియోగంలోకి తీసుకువచ్చేందుకు ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది ప్రయత్నిస్తుండగా నాల్గవ నంబరు జనరేటర్ ఎమ్ఐబీకి చెందిన వాల్వ్ నుంచి భారీగా నీరు ప్రవేశించింది. దానిని గమనించిన సిబ్బంది వెంటనే అప్రమత్తమై కంట్రోల్ రూం సిబ్బంది, టర్బన్‌ఫ్లోర్ సిబ్బంది వెంటనే నీటిని కట్టడి చేయడానికి చర్యలు చేపట్టారు. వాల్వ్ హౌస్‌కు వెళ్లి నాల్గవ నంబరు జనరేటరుకు నీటి విడుదలను నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. లేకుంటే జల విద్యుత్ కేంద్రం నీట మునిగిపోయి ఉండేది. ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది సుమారు మూడు గంటల పాటు శ్రమించి నీటిని కట్టడి చేశారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అప్పటికే టర్బన్‌లో నాల్గవ నంబరు ఎమ్ఐబీ వాల్వ్ ఉన్న ప్రదేశం నీట మునిగిపోయింది. దశలవారీగా ఆ నీటిని బయటకు పంపించి వేసి విద్యుదుత్పాదనను పునరుద్ధరించారు. విద్యుత్ కేంద్రానికి నీరందించే జోలాపుట్టు జలాశయంలో నీటి నిల్వలు అడుగంటిన నేపథ్యంలో కేవలం నాలుగు జనరేటర్ల సహాయంతో 45 మెగావాట్ల విద్యుదుత్పాదన చేస్తున్నారు. తాజా సంఘటన నేపథ్యంలో విద్యుదుత్పాదన మరికాస్త దిగజారిపోయింది. ప్రస్తుతం ఆరవ నంబరు జనరేటర్ సహాయంతో కేవలం 22 మెగావాట్ల విద్యుదుత్పాదన మాత్రమే చేస్తున్నారు.

మన్యంలో భారీ వర్షం

వాతావరణంలో మార్పు ప్రభావం

» తగ్గుముఖం పట్టిన గరిష్ఠ ఉష్ణోగ్రతలు

పాడేరు, మే 19(ఆంధ్రజ్యోతి):

వాతావరణంలో మార్పు ప్రభావంతో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ కాయగా, ఆ తరువాత నుంచి వర్షం కురిసింది. జిల్లా కేంద్రం పాడేరుతో పాటు ఏజెన్సీ వ్యాప్తంగా ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది.

భారీ వర్షానికి రోడ్లన్నీ జలమయం కాగా, పంట పొలాల్లోకి వర్షపు నీరు చేరింది. మురుగుకాల్వలు సైతం వర్షపు నీటితో ప్రవహించాయి. అలాగే జనజీవనానికి అంతరాయం ఏర్పడింది. తాజా వాతావరణంతో జనం ఊరట చెందుతున్నారు. ఏజెన్సీలో ముసురు వాతావరణం కొనసాగుతున్నది.



సీలేరులో వర్షం

ఏజెన్సీలో తగ్గిన ఉష్ణోగ్రతలు

వాతావరణంలోని మార్పుల కారణంగా ఏజెన్సీలో ఆదివారం ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. అనంతగిరిలో 38.8, అరకులోయలో 38.3, చింతపల్లిలో 37.1, డుంబ్రిగుడలో 36.0, జీకేవీధిలో 37.1, జి.మాడుగులలో 37.1, హుకుంపేటలో 38.2, కొయ్యూరులో 39.0, ముంచంగిపుట్టులో 209.3, పాడేరులో 31.8, పెదబయలులో 37.5 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

సీలేరులో..

సీలేరు: జీకేవీధి మండలం సీలేరులో ఆదివారం భిన్న వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భానుడు తన ప్రతాపాన్ని చూపించడంతో ఎండ తీవ్రతకు జనం అల్లాడిపోయారు. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడి జనం సేదతీరారు. సీలేరు పరిసర ప్రాంతాలైన ధారకొండ, ఒడిశాలోని చిత్రకొండ తదితర ప్రాంతాల్లో కూడా భారీ వర్షం కురిసింది.

పెదబయలులో..

పెదబయలు: మండలంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రంగా ఉంది. మధ్యాహ్నం వర్షం కురిసింది. వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. డ్రైనేజీలు పొంగి పొర్లాయి. పంట పొలాల్లో వర్షపు నీరు చేరింది. జనజీవనానికి కొంత సేపు అంతరాయం కలిగింది.



జి.మాడుగులలో వర్షం



పెదబయలు మండలం పన్నెడ వద్ద పంట పొలాల్లో వర్షపు నీరు

గిరిజనుడిపై ఎలుగుబంటి దాడి

» గాయాలతో బాధితుడు ఆస్పత్రిపాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాందాసు

అరకులోయ, మే 19: అరకులోయ మండలం లోతేరు గ్రామ పంచాయతీ శివారు గ్రామం సిరసగూడ గ్రామానికి చెందిన గరం రాందాసు అనే గిరిజనుడిపై ఎలుగుబంటి దాడి చేసింది. ఈ సంఘటన శనివారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో చోటుచేసుకుంది. గ్రామానికి ఆనుకొని ఉన్న కొండపై మేకలు కాసేందుకు జర్రా రాజుతో కలిసి రాందాసు వెళ్లాడు. అక్కడ ఆకస్మికంగా రెండు ఎలుగుబంట్లు దాడి చేశాయి. జర్రా రాజు తప్పించుకోగా, రాందాసు ఎడమకాలి తొడ భాగంపై ఓ ఎలుగుబంటి గాయం చేసింది. స్థానికులు 108 వాహనంలో అతనిని అరకులోయ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అతనికి వైద్యులు చికిత్స చేశారు.

దీర్ఘకాలిక వ్యాధులపై ఇంటింటి సర్వే

జూలై నుంచి చేపట్టేందుకు ఆరోగ్యశాఖ ఏర్పాట్లు

» ఇప్పటికే జిల్లా ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రామ్ ఆఫీసర్లకు ముగిసిన తర్ఫీదు

» త్వరలో సిబ్బందికి అందనున్న శిక్షణ



హెల్త్ సర్వే నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్ ఫొటో)

విశాఖపట్నం, మే 19 (ఆంధ్రజ్యోతి):

దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారిని గుర్తించేందుకు వీలుగా మరోసారి ఇంటింటి సర్వే చేపట్టేందుకు వైద్య ఆరోగ్యశాఖ సన్నద్ధమవుతోంది. గతంలో నాన్ కమ్యూనకబుల్ డిసీజ్ (ఎన్‌సీడీ), ఎన్‌సీడీ 2.ఓ పేరుతో సర్వే నిర్వహించిన ఆరోగ్యశాఖ.. మరో విడత ఇంటింటి సర్వేకు సిద్ధమవుతోంది. ఎన్‌సీడీ 3.ఓ పేరు జూలై మొదటి వారం నుంచి ఈ సర్వేను చేపట్టనుంది.

ఇంటింటి సర్వేలో భాగంగా 18 ఏళ్లు పైబడిన వారి ఆరోగ్య వివరాలను సేకరించనున్నారు. బీపీ, షుగర్, ఆస్ట్రియో ఆర్థరైటిస్ వంటి వ్యాధులతోపాటు కేన్సర్‌కు స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించేందుకు రంగం సిద్ధమవుతోంది. రొమ్ము, సర్వైకల్, ఓరల్ కేన్సర్ నిర్ధారణకు సంబంధించి ఆరోగ్యశాఖ సిబ్బంది రోగుల ఇళ్ల వద్దే స్ర్కీనింగ్ చేపట్టనున్నారు. ఆరోగ్య శాఖకు చెందిన మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్, ఏఎన్ఎం ఆధ్వర్యంలో సర్వే నిర్వహిస్తారు. రోగుల వివరాలను వీరికి కేటాయించిన యాప్‌లో పొందుపరుస్తారు. ఆయా గ్రామాల కు కేటాయించిన పీహెచ్‌సీలోని వైద్యులు (ఫ్యామిలీ ఫిజీషి యన్ కాన్సెప్ట్) రోగులు

... మిగతా 8వ పేజీలో

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నక్కపల్లి, మే 19: మండలంలోని వేంపాడు టోల్‌ప్లాజా సమీపాన శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందగా, మరొకరు గాయపడినట్టు పోలీసులు తెలిపారు. గుంటూరు జిల్లా ఏటి అగ్రహారం, ఫాతిమా నగర్‌కు చెందిన కంతటి నవీన్ (21), అతని స్నేహితుడు వంశీకృష్ణ (17) ఈనెల 17న బైక్‌పై అరకు వెళ్లారు. శనివారం రాత్రి వారు బైక్‌పై తిరిగి గుంటూరు వెళుతుండగా 11 గంటలకు టోల్‌ప్లాజా వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొన్నట్టు పోలీసులు చెప్పారు. దీంతో నవీన్ అక్కడికక్కడే మృతి చెందగా, గాయపడిన కృష్ణను తుని తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పదస్థితిలో వడ్డాది వ్యక్తి మృతి

- అదృశ్యమైన ఐదు రోజుల తర్వాత అంబేరుపురంలో చెట్టుకు వేలాడుతూ కనిపించిన మృతదేహం


గనిశెట్టి నానాజీ (ఫైల్)

చోడవరం, మే 19 : అదృశ్యమైన బుచ్చెయ్యపేట మండలం వడ్డాదికి చెందిన గనిశెట్టి నానాజీ (38) మృతదేహం చెట్టుకొమ్మకు వేలాడుతూ ఉండడం కలకలం రేపింది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఐదు రోజుల క్రితం నానాజీ ఇంటి నుంచి బయటకు వచ్చాడు. నాటి నుంచి కనిపించలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి ఇతని కోసం బంధువులు వెతకడం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఇదే మండలం అంబేరుపురం వెంకన్నపాలెం సరిహద్దులో ఉన్న చెరువు సమీపంలో గల తుప్పల్లో బొడ్డ చెట్టుకు వేలాడుతూ ఉన్న మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. దీనిపై వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి విచారణ జరపగా వడ్డాది గ్రామానికి చెందిన గనిశెట్టి నానాజీగా నిర్ధారణ జరిగింది. నానాజీ కొంతకాలంగా మానసిక సమస్యలతో బాధపడుతున్నాడని, ఈ కారణంతోనే ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని అతని కుటుంబ సభ్యులు భావిస్తున్నట్టు సీఐ శ్రీనివాసరావు తెలిపారు. కాగా ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నానాజీ మృతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు. మృతదేహం బాగా కుళ్లిపోయి ఉండడంతో ఆయన వేసుకున్న దుస్తులు ఆధారంగా గుర్తించి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించామన్నారు.

10 మద్యం క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం

కొత్తూరు, మే 19 : మండలంలోని కోడూరు గ్రామ శివారులో 10 మద్యం క్వార్టర్ బాటిళ్లు తరలిస్తున్న మహిళపై కేసు నమోదు చేసినట్టు అనకాపల్లిరూరల్ పోలీసు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఎస్‌డీఎన్‌కే.రాజు తెలిపారు. అక్రమంగా మద్యం తరలిస్తున్న తలారి వరహాలమ్మను అదుపులోకి తీసుకొని మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఆయన చెప్పారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి నాటిక పోటీలు

- చివరి రోజు చూపరులను కట్టిపడేసిన 'ఓ కాశీవాసి రావయ్యా', 'మనఃసాక్షి' నాటికలు


ఓ కాశివాసి రావయ్యా నాటికలో ఓ సన్నివేశం

కొత్తూరు, మే 19 : అనకాపల్లిలోని వీవీ రమణ రైతు భారతి ఓపెన్ ఆడిటోరియంలో జ్యోతి సరళ స్మారక కళాపరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి ఆహ్వాన నాటిక పోటీలు ఆదివారం ముగిశాయి. పరిషత్ నిర్వాహకుడు పీసీహెచ్. నాయుడు, కేఎం నాయుడుల పర్యవేక్షణలో ఆదివారం జరిగిన విశాఖపట్నం కాలాభినయ కళాకారులు ప్రదర్శించిన "ఓ కాశివాసి రావయ్యా", విజయవాడ హర్ష క్రియేషన్స్ కళాకారులు ప్రదర్శించిన "మనఃసాక్షి" నాటికలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

'ఓ కాశీవాసీ రావయ్యా' నాటిక

మానవత్వపు విలువలు లోపిస్తున్న ఈ సమాజంలో ఎవరికి వాళ్లే కొరివి పెట్టుకునే రోజు వస్తుందని, రేపటి రోజును ఈ రోజే ఊహించి రాసిన నాటిక ఇది. సారయ్య తన భార్య నూకాలుతో ఆ ఊరి శ్మశానంలో కాటికాపరి వృత్తి చేస్తుంటాడు. ఒక రోజు ఆనందరావు అనే ఒక పెద్ద మనిషి శ్మశానానికి వచ్చి తన స్నేహితుడి శవం వస్తుందని, దానికి కావలసిన ఏర్పాట్లు చేయమని చెప్పాడు. దానికి కావలసిన డబ్బును, సారయ్య కాశీకి వెళ్లడానికి కావలసిన ధనాన్ని ఇస్తాడు. సారయ్య తాగడానికి ఊళ్లోకి వెళతాడు. అతను వచ్చేసరికి శ్మశానంలో శవం కాలుతూ ఉంటుంది. అది ఆనందరావు శరీరమని తెలిసి హతాశునౌతాడు. ఇంతలో పోలీసు అక్కడకొచ్చి అక్కడ దొరికిన ఆధారాలను బట్టి, సారయ్య మీద హత్యానేరం మోపుతాడు. భార్యాభర్తలిద్దరూ లబోదిబోమంటారు. అంతలో ఆనందరావు కొడుకు, కోడలు అక్కడికొచ్చి, ఆనందరావు పర్సు, క్రెడిట్ కార్డ్స్, గోల్డ్ మిస్సవ్వలేదని ఆనందపడతారు. వారి మాటల్లో ఆనందరావుకు భార్య పోయిందని, కొడుకు కోడలుతో ఉంటున్నాడని తెలుస్తుంది. తండ్రీ కొడుకుల్ని విడదీయడానికి కోడలు శతధా ప్రయత్నించి, చివరకు మావయ్య తనను కోరుకుంటున్నాడని భర్తతో చెబుతుంది. దానితో మనసు విరిగిపోయిన ఆనందరావు పై విధంగా కాలిపోతాడు. ఆయన రాసిన ఉత్తరంతో, తన మరణానికి ఎవరూ కారకులు కారని తెలపడంతో కేసు లేకుండా పోతుంది. ఆనందరావు చివరి కోరికగా ఆయన అస్థికలు తీసుకుని, కాశీకి ప్రయాణమవుతారు సారయ్య, నూకాలు.

'మనఃసాక్షి' నాటిక

ప్రతి మనిషికి మనఃసాక్షి ఉంటుంది. అది కుటుంబ సంస్కారాలు, సంప్రదాయాల వలన రూపుదిద్దుకుంటుంది. కానీ చంద్రశేఖర పాత్ర తన మనఃసాక్షికి భిన్నంగా ధనార్జనే జీవిత ధ్యేయంగా అక్రమంగా సంపాదిస్తుంటాడు. అదే డబ్బు కోసం తన కొడుకు తండ్రి పంథాలో నడిచి తనకి కీడు చేస్తాడు. చంద్రశేఖరం పశ్చాతపడి డబ్బు శాశ్వతం కాదని నిర్ణయానికి వస్తాడు. మనిషికి కావాల్సింది పిడికెడు మెతుకులు బారెడుగుడ్డ, ఆరడుగులు నేల మాత్రమే మనిషికి శాంతినిస్తుందనే సందేశాన్ని తెలిపేది 'మనఃసాక్షి' నాటిక. ఈ నాటికకు రచన కీర్తిశేషులు డాక్టర్ పి.బ్రహ్మానందరావు, దర్శకత్వం కత్తి శ్యాం ప్రసాద్ వహించారు.


మనఃసాక్షి నాటికలో ఓ సన్నివేశం

అప్పన్న దర్శన వేళల్లో స్వల్ప మార్పులు

సింహాచలం, మే 19: వరాహలక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో ఆదివారం నుంచి ప్రారంభమైన విశిష్టాద్వైత మత ప్రచారకులు నమ్మాళ్వార్ తిరు నక్షత్ర పూజలను పురస్కరించుకుని ఈనెల 23 వరకు రాత్రి 7 గంటల వరకు మాత్రమే భక్తులకు దర్శనాలు లభిస్తాయని ఈఓ శ్రీనివాసమూర్తి తెలిపారు. ఈమేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 22న నృసింహ జయంతి సందర్భంగా సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే స్వామివారి దర్శనాలు లభిస్తాయని, ఆయా రోజుల్లో రాత్రి ఆరాధన టికెట్లు రద్దు చేసినట్టు ఆయన చెప్పారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	138.00
లైవ్ ధర	158.00
విత్ స్కిన్	286.00
స్కిన్ లెస్	296.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

అటకెక్కిన పేట అభివృద్ధి

నాలుగేళ్లుగా సాగుతున్న పంచాయతీ భవన నిర్మాణం

- అతీగతీలేని మెయిన్ రోడ్డు సెంట్రల్ లైటింగ్ సిస్టమ్
- ప్రతిపాదనలకే పరిమితమైన 'తాండవ' రక్షణ గోడ
- అభివృద్ధికి నోచుకోని అంబేడ్కర్ పార్కు


నీలం తుఫాను సమయంలో వరద నీటికి ముంపు బారిన పడిన పాయకరావుపేట(ఫైల్ ఫొటో)


శ్లాబు దశలో ఆగిపోయిన పంచాయతీ కార్యాలయ భవనం

పాయకరావుపేట, మే 19: పాయకరావుపేటలో అభివృద్ధి అటకెక్కింది. ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టణ అభివృద్ధిని గాలికొదిలేసింది. గత ఐదేళ్లలో ప్రధాన సమస్యలు ఒక్కటి కూడా పరిష్కారం కాకపోగా.. చేపట్టిన అభివృద్ధి పనులు ప్రజల అవసరాలను తీర్చలేకపోతున్నాయి.

నాలుగేళ్లుగా పూర్తి కాని పంచాయతీ భవనం

పాయకరావుపేట పంచాయతీ కార్యాలయ భవనం శిథిల స్థితికి చేరుకోవడంతో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పాత భవనాన్ని తొలగించి పంచాయతీ కార్యాలయం, సచివాలయం-1 భవన నిర్మాణాన్ని నాలుగేళ్ల క్రితం చేపట్టారు. అయితే బిల్లుల చెల్లింపులో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేయడంతో ఇప్పటికీ శ్లాబ్ స్థాయిలోనే భవనం ఉండిపోయింది. దీంతో పంచాయతీ కార్యాలయం నాలుగేళ్లుగా స్థానిక రాజుగారిబీడులోని అద్దె భవనంలోని ఇరుకు గదుల్లో కొనసాగుతోంది. పంచాయతీ పాలకవర్గ సమావేశాలు, గ్రామసభలు నిర్వహించేందుకు స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారు.

మెయిన్‌రోడ్డు సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌కు మోక్షమెప్పుడో?

పాయకరావుపేటలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి 2018లో టీడీపీ హయాంలో రూ.6.3 కోట్లతో చేపట్టిన మెయిన్‌రోడ్డు విస్తరణతో పాటు సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ పనులు రోడ్డు మార్జిన్ వర్తకుల కోర్టులో వ్యాజ్యం వేయడంతో నిలిచిపోయిన విషయం తెలిసిందే. తాను గెలిస్తే రోడ్డు మార్జిన్ వర్తకుల సమస్య పరిష్కరించి, ఒక్క ఏడాదిలో మెయిన్‌రోడ్డు విస్తరణ చేస్తానని హామీ ఇచ్చి 2019 ఎన్నికల్లో విజయం సాధించిన గొల్ల బాబూరావు నాలుగేళ్ల వరకు పట్టించుకోలేదు. అయితే ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో గతేడాది రూ.2 కోట్లతో మెయిన్‌రోడ్డుపై గోతులు పూడ్చి రోడ్డు విస్తరణ చేపట్టకుండా పునర్నిర్మాణం చేశారు. దీంతో సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు అటకెక్కింది. కనీసం రోడ్డు ఆక్రమణలు తొలగించి విస్తరణ కూడా చేయని కారణంగా ట్రాఫిక్ సమస్య యథాతథంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.


విస్తరణ, సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు లేకుండా కేవలం పునర్నిర్మించిన మెయిన్‌రోడ్డు

ఊసేలేని 'తాండవ' రక్షణ గోడ నిర్మాణం

పట్టణాన్ని ఆనుకుని ప్రవహిస్తున్న తాండవ నది వరదల సమయంలో ఉధృతంగా ప్రవహిస్తూ పట్టణాన్ని ముంచెస్తుండడంతో రక్షణ గోడ నిర్మాణం చేపట్టాలని దశాబ్దం క్రితం నిర్ణయించినా ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. ఇందు కోసం అధికారులు ఏటా ప్రతిపాదనలు పంపడమే కాని నిధులు విడుదల కాలేదు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సుమారు రూ.72 కోట్లతో ప్రతిపాదనలు పంపినా ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదు. దీంతో తాండవ నదికి వరదలు వస్తున్న ప్రతిసారి పట్టణంలో రెండు కిలోమీటర్లున్న నది పరివాహక ప్రాంతంలో నివాసితులతో పాటు పట్టణ ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

నిర్వహణ లేని అంబేడ్కర్ పార్కు

ఎస్సీ నియోజకవర్గ కేంద్రమైన పాయకరావుపేటలో డాక్టర్ అంబేడ్కర్ పేరు మీద ఉన్న పార్కు ఎన్నో ఏళ్లుగా నిర్వహణ లేక కనీస అభివృద్ధికి నోచుకోలేదు. విరిగిన బొమ్మలు, తుప్పలతో చిట్టడవిగా దర్శనమిస్తున్న పార్కు గురించి పట్టించుకునే నాథులే కరువయ్యారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పార్కు అభివృద్ధి చెందుతుందని పట్టణ ప్రజలు భావించారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చి ఐదేళ్లు పూర్తయినా కనీసం పట్టించుకోకపోవడం గమనార్హం.

భక్తులతో కిటకిటలాడిన నూకాంబిక ఆలయం


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


ఘటాలతో ఆలయానికి చేరుకున్న భక్తులు

అనకాపల్లి టౌన్, మే 19: స్థానిక నూకాంబిక ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజామున ఆరు గంటలకు ఆలయ అర్చకులు బాలాలయంలోని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం నుంచే అమ్మవారి ఆలయానికి వచ్చే రహదారులు భక్తులతో సందడిగా మారాయి. క్యూలైన్ లు అన్ని నిండిపోయాయి. ఉమ్మడి విశాఖ జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి కూడా భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే చాలా మంది భక్తులు అమ్మవారి పండగను చేసుకుని ఘటాలతో ఆలయానికి వచ్చి అమ్మవారికి ఘటాలు సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు. అలాగే ఆలయ ఆవరణలో భక్తులు వంటలు తయారుచేసుకుని అమ్మవారికి నైవేద్యం పెట్టి కుటుంబసమేతంగా అందరూ కలిసి భోజనాలు చేశారు.

ఉష్ణోగ్రత కారణంగా ఆలయంలోని భక్తులకు ఆలయ అధికారులు చల్లటి మంచినీటిని క్యూలో ఉన్న వారికి అందజేశారు. అలాగే స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కూడా చలివేంద్రాలు ఏర్పాటు చేసి భక్తులకు చల్లటి మజ్జిగ, మంచినీటిని పంపిణీ చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది చర్యలు తీసుకున్నారు. అలాగే ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

అధ్వానంగా పంట కాలువలు

- యల్లయ్య, చెర్లోపలి కాలువల్లో పేరుపోయిన పూడిక
- దుర్వాసనతో అనకాపల్లి పట్టణవాసులు ఇక్కట్లు
- పట్టణంలో దోమలు స్వైరవిహారం
- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు


నాగులాపల్లి పంట కాలువలో పేరుకుపోయిన చెత్త


యల్లయ్య కాలువలో పేరుకుపోయిన చెత్త, తుప్పలు

అనకాపల్లి టౌన్, మే 19 : పట్టణ నడిబొడ్డున ఉన్న సాగునీటి పంట కాలువలు అధ్వానంగా మారాయి. యల్లయ్య చెర్లోపలి కాలువల్లో చెత్తా చెదారం పేరుకుపోవడమే కాకుండా పలుచోట్ల పిచ్చి మొక్కలు మొలవడంతో కాలువల స్వరూపమే మారిపోయాయి. శారదా నదిలో గ్రోయిన్లు దెబ్బతినడం కారణంగా నదిలోంచి ఈ పంట కాలువల ద్వారా రైతాంగానికి సాగునీరందని పరిస్థితి నెలకొంది. గత కొన్నేళ్లుగా పట్టణవాసుల వాడుక నీరే ఈ కాలువలో ప్రవహిస్తున్నది. కాలువల్లో పలుచోట్ల ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంతో నీటి ప్రవాహం కూడా అంతంత మాత్రంగానే ఉంది. వాస్తవానికి ఈ సాగునీటి కాలువల ద్వారా రైతాంగం పండించే పంటలకు నీటిని అందించే బాధ్యత నీటిపారుదల శాఖదే. అయితే పట్టణ నడిబొడ్డున కాలువలు ఉండడం, ఈ కాలువలకు ఆనుకుని కొన్నేళ్ల క్రితం మున్సిపాలిటీ నీరు పోయేందుకు కాలువలను ఏర్పాటు చేసింది. మొత్తం నీటి ప్రవాహం అంతా ప్రజల వాడుకనీటితో ఉన్నందున సాగునీటి కాలువల నిర్వహణ బాధ్యతలు జీవీఎంసీకే నీటిపారుదల శాఖ అధికారులు అప్పగించారు. అప్పటి నుంచి జీవీఎంసీ వారే ప్రతి ఏటా కాలువల్లో పూడికతీత పనులు, శుభ్రతకు చర్యలు చేపడుతున్నారు. అయితే గత కొంతకాలంగా కాలువల్లో పూడిక తీయకపోవడం, పరిశుభ్రతకు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో కాలువలు దుర్భరంగా మారాయి. గతేడాది చివరలో కాలువల్లో పూడికతీత పనులు మమ అనిపించారనే ఆరోపణలు ఉన్నాయి. అనువైన కొన్నిచోట్ల మాత్రమే పూడికలు పూర్తిస్థాయిలో తీసి మిగిలిన చోట్ల నామమాత్రంగా తీశారనే విమర్శలు లేకపోలేదు. ఆరు నెలలకు ఒకసారి కాలువల్లో పేరుకుపోయిన పూడికలు తీయాలని, కానీ జీవీఎంసీ అధికారులు అలా చేయడం లేదని రైతుసంఘాల నాయకులు చెబుతున్నారు. కాలువలకు ఆనుకుని ఉన్న నివాసితులు దుర్వాసన భరించక తప్పడం లేదు. అలాగే మురుగునీరు నిల్వ ఉండడంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఇప్పటికైన అధికారులు స్పందించి అధ్వానంగా ఉన్న పంట కాలువల్లో పూడికలు తీసి కాలువలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని పలువురు కోరుతున్నారు.

ఉదయం ఎండ వాత.. సాయంత్రం కుండపోత..!

- పలు మండలాల్లో విభిన్న వాతావరణం


ఎండ ధాటికి వెలవెలబోయిన కె.కోటపాడులోని ప్రధాన రహదారి


సాయంత్రం రావికమతం మండలం కొమిర గ్రామంలో వర్షం

రావికమతం/ కె.కోటపాడు, మే 19: ఓ వైపు వేసవి కారణంగా భానుడు ఉగ్రరూపం చూపుతుండగా, మరో వైపు వరుణుడు కరుణిస్తున్నాడు. ఫలితంగా ఉదయం నుంచి ఉష్ణతాపం, సాయంత్రం నుంచి చల్లని వాతావరణం ఏర్పడుతోంది. గత కొద్ది రోజులుగా మండలంలో ఇదే పరిస్థితి నెలకొంటోంది. ఇటీవల కాలంలో అడపాదడపా వర్షాలు కురుస్తున్నప్పటికీ మే నెల, అందునా అగ్ని కార్తెలు కావడంతో ఎండలు మండుతున్నాయి. ఈ విభిన్న వాతావరణంతో అంతగా ఉక్కపోత లేకపోవడంతో జనం కాస్త ఉపశమనం పొందుతున్నారనే చెప్పాలి. వ్యవసాయ పనులకు సైతం తాజా వర్షాలు దోహదపడతాయని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలావుంటే, కె.కోటపాడు మండలవాసులు ఎండ తీవ్రతకు అల్లాడిపోతున్నారు. రెండుమూడు రోజుల క్రితం వర్షాలు కురవడంతో కాస్త ఉపశమనం పొందారు. అయితే ఆదివారం ఉదయం నుంచి ఎండ మండింది. సాయంత్రం ఆకాశంలో మేఘాలు కమ్ముకోవడంతో చల్లబడింది. ఎండ కారణంగా నిత్యం రద్దీగా ఉండే కె.కోటపాడు మూడురోడ్ల జంక్షన్‌లోని ప్రధాన రహదారి వెలవెలబోయింది.

శ్మశానవాటిక స్థలం కబ్జాకు యత్నం!

ట్రాక్టర్‌తో దున్నేసిన అక్రమార్కులు

- ప్రశ్నించిన రామచంద్రపురం గ్రామస్థులు
- ఫలితం లేకపోవడంతో అధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధం


రామచంద్రపురంలో శ్మశానవాటిక స్థలాన్ని దున్నుతున్న ట్రాక్టర్

కృష్ణాదేవిపేట, మే 19: ఆక్రమణకు కాదేదీ అనర్హం అన్న నానుడిని కొందరు అక్రమార్కులు నిజం చేసి చూపుతున్నారు. ఇందుకు గొలుగొండ మండలంలోని లింగంపేట పంచాయతీ శివారు గ్రామంలో జరుగుతున్న తంతే ఉదాహరణ. ఇక్కడి రామచంద్రపురం గ్రామంలో గల శ్మశానవాటిక స్థలంపై కొందరు కన్నేశారు. ఇందులో భాగంగా ఆదివారం సదరు స్థలాన్ని ట్రాక్టర్‌తో దున్ని తమ గుప్పెట్లోకి తెచ్చుకునే ప్రయత్నాలను ఆరంభించారు. సమీపంలోని తాళ్లచీడికాడ గ్రామానికి చెందిన కొంత మంది ఇందుకు పాల్పడుతున్నారన్న వాదన వినిపిస్తోంది. దీనిపై గ్రామస్థులు అడగ్గా తిరగబడడంతో చేసేది లేక రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తామని వారు తెలిపారు. ఈ స్థలంలో ప్రభుత్వం చేతిబోరు వేయించడంతో పాటు గ్రామానికి 38సెంట్లు స్థలాన్ని శ్మశానవాటిక కోసం మంజూరు చేస్తున్నట్టు గతంలో పట్టా కూడా మంజూరు చేసింది ఈ ఆక్రమణ యత్నంపై మండల అధికారులు తక్షణమే స్పందించాల్సిందిగా గ్రామ ఉప సర్పంచ్, జనసేన నాయకుడు లంక సత్యనారాయణ కోరారు. లేనిపక్షంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు.

గ్రామీణ ఓటర్లలో చైతన్యం

- 17 పోలింగ్ కేంద్రాల్లో 90 శాతానికి పైగా ఓటింగ్


రావలమ్మపాలెంలో ఓటేసేందుకు బారులు తీరిన ఓటర్లు

సబ్బవరం, మే 19: మండలంలో గ్రామీణ ఓటర్లలో గతం కంటే చైతన్యం పెరిగింది. మండలంలో జీవీఎంసీ 88వ వార్డు కలుపుకొని 68 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. పైడివాడ 60 నంబరు బూత్‌లో అత్యధికంగా 96.34 శాతం, మర్రిపాలెం 12వ బూత్‌లో 95.93 శాతం, వంగలి(5)లో 93.35శాతం, ఎరుకునాయుడుపాలెం(57)లో 92.45 శాతం, గుల్లేపల్లి (17)లో 92.37 శాతం, రావలమ్మపాలెం (8)లో 92.29 శాతం, నారపాడు (52)లో 92.21 శాతం, ఎల్లుప్పి (11)లో 91.77శాతం, బాటజంగాలపాలెంలో 91.73 శాతం, పైడివాడఅగ్రహారం (63)లో 91.46 శాతం, గొటివాడ (41,42 పిఎస్‌లు)లో 91 శాతం, గాలిభీమవరం (43)లో 91 శాతం, రాయపుర అగ్రహారం(3)లో 90.60 శాతం, బుదిరెడ్ల మర్రిపాలెంలో 90.37 శాతం, టెక్కలిపాలెం (45)లో 90.17 శాతం, జాగారపువానిపాలెం (90)లో 90 శాతం ఓటింగ్ నమోదైంది. పట్టణ వాతావరణ కలిగిన జీవీఎంసీ 88వ వార్డు పరిధి 68వ వార్డులో అతి తక్కువగా 55.40 శాతం ఓట్లు నమోదయ్యాయి. చాలా పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంల్లో సాంకేతిక లోపం వలన ఓటింగ్ శాతం తగ్గింది, అందుకు కారణం పోలింగ్ కేంద్రాల్లో లైటింగ్ సమస్య, ఈవీఎంలు నెమ్మదిగా స్పందించడం, ఓటరు కనీసం 3 నుంచి 4 గంటలు క్యూలో ఉండడం వంటి కారణాల వలన పోలింగ్ శాతం తగ్గిందని రాజకీయ పార్టీల నేతలు అంటున్నారు. వచ్చే ఎన్నికలు నాటికి పోలింగ్ కేంద్రాలు సంఖ్య పెంచాలని వారు అభిప్రాయపడుతున్నారు.

పెదపాడు.. సమస్యల గోడు!

ఆదివాసీ గ్రామాల్లో సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్టు ప్రభుత్వం గొప్పలు చెప్పడం తప్పితే ఆచరణలో అమలు కావడం లేదు. దీంతో స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు దాటిపోతున్నా పీవీటీజీ గిరిజనుల పరిస్థితి ఏమాత్రం మారడం లేదు. కనీస సౌకర్యాలకు నోచుకోక.. సమస్యల వలయంలో దయనీయమైన జీవనం సాగించాల్సిన దుస్థితి తప్పడం లేదు. ఇందుకు నిదర్శనమే కొర్రా పంచాయతీ పరిధిలోని పెదపాడు ఆదివాసీ గ్రామం.

- గ్రామంలో కనీస సదుపాయాలు కరువు
- కలుషిత ఊట కుండీ నీరే ఆధారం
- కానరాని సీసీ రోడ్లు, కాలువలు
- గిరిజనుల పడరాని పాట్లు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



గ్రామ శివారున పొలాల్లో కలుషిత ఊట కుండీ నీటిని తీసుకువెళ్తున్న మహిళలు

డుంబ్రిగుడ, మే 19:

పెదపాడు గ్రామంలో 105 కుటుంబాలకు చెందిన సుమారు 550 మంది పీవీటీజీ గిరిజనులు జీవనం సాగిస్తున్నారు. ఈ గ్రామంలో కనీస సదుపాయాలు కరువయ్యాయి. తాగునీరు అందుబాటులో లేదు సరికదా రహదారులు, వీధి కాలువలు ఎక్కడా కానరావడం లేదు. ప్రధానంగా తాగునీటి ఎద్దడితో గిరిజనులు ఏడాది పొడవునా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మూలకు చేరిన గ్రావిటీ పథకం

గ్రామస్థుల సౌకర్యార్థం గతంలో గ్రావిటీ పథకాన్ని నిర్మించారు. ఇది మూడేళ్లుగా మరమ్మతులకు గురైన మూలకు చేరింది. దీంతో గుక్కెడు తాగునీటి కోసం గిరిజనులు పడరాని పాట్లు పడుతున్నారు. గత్యంతరం లేకపోవడంతో గ్రామానికి శివారున పొలాల్లోని కలుషిత ఊట కుండీ నీటిపైనే ఆధారపడుతున్నారు. ఎటువంటి అవకాశం లేకపోవడంతో ఈ కలుషితమైన ఊటగడ్డ నీటినే సేకరించుకుని తాగుతున్నామని గిరిజనులు వాపోయారు. దీనివల్ల తరచూ వ్యాధుల బారిన పడి ఆనారోగ్యాలకు గురవుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యను అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినా ఏమాత్రం ఫలితం లేకపోతున్నదని వాపోయారు.

డ్రైనేజీ వ్యవస్థ లేక మురుగు సమస్య

అలాగే గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించకపోవడంతో వర్షాలు కురిసినప్పుడు గిరిజనులు నరకయాతన అనుభవిస్తున్నారు. వర్షం నీరు, గ్రామస్థులు ఉపయోగిస్తున్న మురుగు నీరు నివాస గృహాలకు ఎదురుగా నిల్వ ఉండిపోతోంది. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం.. పంచాయతీ సిబ్బంది పట్టించుకోకపోవడం వెరసి రోజులు తరబడి మురుగు పేరుకుపోతోంది. దీంతో ఈగలు, దోమలు వృద్ధి చెందుతున్నాయని, వాటి బారిన పడి వ్యాధులకు గురవుతున్నామని గిరిజనులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలను సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు తెలిపినా కనీసం పట్టించుకోవడం లేదని గ్రామస్థులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి గ్రామంలో కనీస సదుపాయాలు కల్పించాలని, తాగునీటి కోసం తగిన చర్యలు చేపట్టాలని, సీసీ రోడ్లు, కాలువలు నిర్మించాలని ముక్తకంఠంతో వారు వేడుకుంటున్నారు.



చుక్క నీరు ఇవ్వని గ్రావిటీ నీటి ట్యాంకు

తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం..



-వంతల బందో, గ్రామస్థురాలు

గ్రామంలో నిర్మించిన గ్రావిటీ పథకం మూడేళ్లుగా మరమ్మతుకు గురై మూలకు చేరింది. అప్పటి నుంచి తాగునీటికి తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నాం. దీంతో గ్రామానికి సమీపంలో ఉన్న ఊట కుండీ నీటిని తెచ్చుకుని వాడుకుంటున్నాం. ఈ నీటిని తాగడం వల్ల అప్పుడప్పుడు రోగాల బారిన పడుతున్నాం. అధికారులు స్పందించి గ్రావిటీ పథకాన్ని మరమ్మతు చేసి వినియోగంలోకి తీసుకువస్తే ఈ సమస్య తీరుతుంది.

మురుగు నీటితో నరకం చూస్తున్నాం..

-వంతల ప్రసాద్, గ్రామస్థుడు



గ్రామంలో సీసీ రోడ్లు, వీధి కాలువల నిర్మించకపోవడంతో మురుగు సమస్య వేధిస్తున్నది. గ్రామస్థులు ఉపయోగించిన మురుగు నీరు ఎక్కడికక్కడ నిల్వ ఉండిపోతున్నది. దీంతో దోమలు వ్యాప్తి చెంది వ్యాధులు వస్తున్నాయి. అలాగే భరించలేని దుర్వాసనతో నరకం చూస్తున్నాం. అధికారులు, పాలకులు తక్షణమే స్పందించి గ్రామంలో ఈ సమస్యను పరిష్కరించాలి.

సంక్షిప్తంగా..

21, 22న గురుకుల కళాశాలల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్

చింతపల్లి, మే 19: గిరిజన సంక్షేమ శాఖ గురుకుల కళాశాల్లో ప్రవేశాల కోసం ఈ నెల 21, 22 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ రామేశ్వరం తెలిపారు. పాడేరు ఐటీడీఏ పరిధిలోని ఎనిమిది గిరిజన సంక్షేమ శాఖ గురుకుల కళాశాలల్లో ప్రథమ సంవత్సరం ఇంటర్ ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న విద్యార్థినీ, విద్యార్థులకు పాడేరు బాలికల గురుకుల కళాశాల ఆవరణలో కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. 21వ తేదీన బాలురు, 22వ తేదీన బాలికలకు కౌన్సెలింగ్‌కు నిర్వహించనున్నట్టు చెప్పారు. విద్యార్థులు టీసీ, పదో తరగతి మార్కుల మెమో, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు రేషన్, ఆధార్ కార్డుల ఒరిజినల్స్‌తో హాజరు కావాలని ఆయన సూచించారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

పెదబయలు, మే 19: మండలంలో 144 అమలులో ఉన్నందున అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పదని ఎస్ఐ మనోజ్‌కుమార్ హెచ్చరించారు. మండలంలోని గంపరాయి పంచాయతీ కేంద్రంలో గిరిజనులతో ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ఫలితాల విషయమై పంతాలు, గొడవలు పడకూడదని చెప్పారు. నాయకులు, కార్యకర్తలు, ప్రజలు శాంతియుతంగా ఉండాలని ఆయన సూచించారు.

సీపీఎం నేత సుందరయ్యకు నివాళి

పాడేరు, మే 19 (ఆంధ్రజ్యోతి): సీపీఎం నేత పుచ్చలపల్లి సుందరమ్య వర్ధంతిని ఆ పార్టీ నేతలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. అలాగే ఆయన స్ఫూర్తితో బడుగు, బలహీన వర్గాల తరఫున పోరాటాలు సాగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు వంతాల దాసు, కామరాజు, వరహాలుబాబు, మత్స్యరాజు పాల్గొన్నారు.

ఘనంగా రాకాసమ్మ జాతర

చింతపల్లి, మే 19: మండలంలోని బురడవీధి రాకాసమ్మ జాతర ఘనంగా ప్రారంభమైంది. ప్రతీ ఏడాది భక్తులు రాకాసమ్మ జాతర మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. ఈ ఏడాది 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు జాతర నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. తొలి రోజు రాకాసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ప్రతీ రోజు ఉదయం ప్రత్యేక పూజలు, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

వాహనం ఢీకొని మూగజీవి మృతి



రోడ్డు పక్కన మృతి చెందిన ఉన్న ఎద్దు

డుంబ్రిగుడ, మే 19: మండలంలోని కించుమండ ప్రధాన రహదారి వద్ద శనివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో మూగజీవి మృత్యువాత పడింది. ఈ రహదారికి ఇరువైపులా వీధి దీపాలు అమర్చకపోవడంతో ఇటువంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రాహదారిలో ఇటువంటి సంఘటనలపై సంబంధిత అధికారులు తక్షణమే తగిన దృష్టి సారించాలని వారు కోరుతున్నారు.

24 నుంచి టెన్త్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు

సబ్బవరం, మే 19: ఈ నెల 24 నుంచి ఏడు రోజులు పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయని ఎంఈవో-2 బి.సూర్యనారాణమూర్తి తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 9.30 గంటల నుంచి 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఆదివారం ప్రశ్నపత్రాలు స్థానిక పోలీసు స్టేషన్‌లో పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ రొంగలి ప్రసాద్ సమక్షంలో డిపాజిట్ చేశారు.

కంటి వ్యాధుల నివారణపై అవగాహన

కొత్తూరు, మే 19: కంటి వ్యాదుల నివారణ చర్యలపై డాక్టర్ పరమేశ్వరరావు అవగాహన కల్పించారు. కంటి పట్ల నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి శుభ్రం చేసుకోవాలన్నారు. బయటకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చినప్పుడు ముఖం నీటితో శుభ్రం చేసుకోవాలన్నారు. కంటి విషయంలో నిర్లక్ష్యంగా చేస్తే చాలా ప్రమాదమని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డీడీ.నాయుడు పాల్గొన్నారు.



కల్యాణ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, తదితరులు

వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ వేడుకలు

- స్వామివారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

పాడేరు, మే 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సుండ్రుపుట్టువీధిలో పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆదివారం వార్షిక కల్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కల్యాణ వేడుకలను నిర్వహించారు. అలాగే కార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి పాల్గొని గోవింద సమేత వీరబ్రహ్మేంద్రస్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో మోదకొండమ్మ ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలంనాయుడు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కొట్టగుళ్లి రామారావు, విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

పాడేరు ఆస్పత్రిలో సదుపాయాలు మెరుగుపర్చాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాంగి రాజారావు



ఆస్పత్రిలో రోగులను పరామర్శిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాంగి రాజారావు

పాడేరు, మే 19 (ఆంధ్రజ్యోతి): పాడేరులోని జిల్లా ఆస్పత్రిలో సుదపాయాలను మెరుపర్చాలని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు, కూటమి అరకులోయ ఎమ్మెల్యే అభ్యర్థి పాంగి రాజారావు డిమాండ్ చేశారు. స్థానిక జిల్లా ఆస్పత్రిని ఆదివారం ఆయన సందర్శించి పలువురు రోగులను పరామర్శించారు. వారితో మాట్లాడి సదుపాయాలపై ఆరా తీశారు. సరిపడా మరుగుదొడ్లు లేకపోవడంతో పాటు తాగునీటి సమస్య ఉందని పలువురు రోగులు తెలిపారు. జిల్లా కలెక్టర్ స్పందించి ఆయా సమస్యలను పరిష్కరించాలని, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఈ సందర్భంగా రాజారావు కోరారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు పాంగి మత్స్యకొండబాబు, శ్రీశైలం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రబలిన సీజనల్ వ్యాధులు

- నక్కపల్లి ఆస్పత్రిలో పెరుగుతున్న ఓపీ



నక్కపల్లి ఆస్పత్రిలో ఓపీ వద్ద రోగుల క్యూ

నక్కపల్లి, మే 19: మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాల్లో సీజనల్ వ్యాదులు ప్రబలాయి. జ్వరాలు, తలనొప్పి, దగ్గు, కాళ్లు, కీళ్ల నొప్పులు వంటి వ్యాదులతో నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల్లోని రోగులు నక్కపల్లి 50 పడకల ఆస్పత్రికి వస్తున్నారు. మండువేసవిలో కూడా నక్కపల్లి ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య ఎక్కువగా ఉంది. ఓపీ వద్ద రోగుల రద్దీ కనబడుతోంది. వ్యాధి తీవ్రత వున్న వారిని ఆస్పత్రి జనరల్ వార్డులో చేర్పించి వైద్య సేవలందిసస్తున్నారు. అవసరమైన వారికి ఆస్పత్రిలోనే రక్తపరీక్షలు కూడా చేస్తున్నారు. రోజుకు సగటున 250 మంది రోగులు ఆస్పత్రికి వస్తుండగా, వారిలో దాదాపు 40శాతం మంది సీజనల్ వ్యాధులతో బాధపడుతున్నవారే కనబడుతున్నారు. ఈ సందర్బంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఈశ్వరప్రసాద్ మాట్లాడుతూ.. వేసవి ఎండలతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. మసాలా లేని తేలిక పాటి ఆహారం, ఆకుకూరలు తీసుకోవడం మంచిదన్నారు. మంచి నీరు, కొబ్బరినీరు, గ్లూకోజ్, బార్లీ ,మజ్జిగ వంటి ద్రవ పదార్థాలు ఎక్కువ తీసుకోవాలన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు

ధారకొండ కాలనీలోని పంట పొలాల్లో కిందకి వేలాడుతున్న వైర్లు

చేతికందేలా వైర్లు... పట్టించుకోని అధికారులు





ధారకొండ పొలాల్లో ఒరిగిన విద్యుత్ స్తంభం, వేలాడుతున్న వైర్లు

సీలేరు, మే 19: గూడెంకొత్తవీధి మండలంలోని ధారకొండ కాలనీలో విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. కాలనీలోని పంట పొలాల్లో వైర్లు కిందకి వేలాడుతున్నాయి. రైతుల చేతిక అందే విధంగా ఉన్నాయి. కాగా, విద్యుత్ స్తంభాలు కూడా ఇటీవల వీచిన ఈదురుగాలులకు పక్కకు ఒరిపోయాయి. దీంతో నిత్యం పొలం పని కోసం అటుగా వెళ్తున్న రైతులు, మేత కోసం వచ్చే పశువులకు ప్రమాదం పొంచివుందని స్థానిక ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సంబంధింత లైన్‌మేన్, ఈపీడీఎల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టడం లేదని వాపోయారు. విద్యుత్ స్తంభాలను సరిచేసి వైర్లను పైకి లాగించాలని వినతులను చెత్తబుట్టలో పడేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను, వైర్లను సరిచేసి తమ ప్రాణాలు కాపాడాలని గిరిజనులు

ధారాలమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు





అమ్మవారి దర్శనానికి తరలివచ్చిన భక్తజనం... ధారాలమ్మ ఆలయం వద్ద రద్దీతో స్నానాల కోసం నీటికి పాట్లు పడుతున్న భక్తులు

సీలేరు, మే 19: ధారకొండ ఘాట్ రోడ్డులోని ధారాలమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సార్వత్రిక ఎన్నికల ముగియడంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పలు పార్టీలకు చెందిన కార్యకర్తలు, భక్తులు అమ్మవారిని దర్శించుకోవడానికి బారులు తీరారు. ఎన్నికల్లో తమ పార్టీ నాయకులు గెలవాలంటూ అమ్మవారికి పూజలు చేశారు. వీరితో పాటు పాఠశాలలు, కళాశాలలు త్వరలోనే ప్రారంభమవుతున్న తరుణంలో విద్యార్థులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులను తీర్చుకోవడంతో ఆలయంలో రద్దీ నెలకొంది. కాగా, స్నానాలు చేయడానికి నీటి సమస్య తలెత్తి భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కొండలపై నుంచి వచ్చే ఊటనీటిని పైపులో పట్టుకోవడానికి భక్తులు ఎగబడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కన్నులపండువగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు... (ఇన్‌సెట్‌లో) స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

అరకులోయ, మే 19: మండల కేంద్రంలో వేంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద ఆదివారం స్వామివారి కల్యాణ మహోత్సవం కన్నులపండువగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ శీలం అప్పలరాజు, ఆలయ కమిటీ చైర్మన్ సమర్థి రఘునాథ్ ఆధ్వర్యంలో కార్యక్రమానికి ఏర్పాట్లు చేశారు. అర్చకులు బాలగణేష్, కళింకోటకు చెందిన శ్రీమారుతివిద్యాపీఠం శ్రీమాన్ రేజేటి శ్రీరామాచార్యులు మంత్రోచ్చరణల మధ్య స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. బంగారు షాపు యజమాని సర్వదేముళ్ల దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. కల్యాణ మహోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు ఎ.కామేష్, అర్జున్, సిహెచ్.రామారావు, ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు, సభ్యులు కాపుగంటి కృష్ణారావు, కొల్లా రమేష్‌బాబు, డి.వెంకట్రావు, చిట్టిబాబు, బొంజిబాబు, తిరుపతిరావు,నాని, సురేష్, రాము, నాయుడు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక వ్యాధులపై ఇంటింటి సర్వే

... 5వ పేజీ తరువాయి

వివరాలను పరిశీలించి, అవసరమనుకుంటే మెరుగైన పరీక్షలు, వైద్య సేవలు అందించేందుకు అనుగుణంగా రిఫరల్ ఆస్పత్రులకు, ఆరోగ్యశాఖ నెట్‌వర్క్ ఆస్పత్రులకు తరలించనున్నారు.

త్వరలో సిబ్బందికి శిక్షణ

ఎన్‌సీడీ 3.ఓ సర్వే నిర్వహణకు సంబంధించి జిల్లా స్థాయి లో ఒక అధికారి ఇప్పటికే శిక్షణ తీసుకుని వచ్చారు. వీరి ఆధ్వర్యంలో జిల్లాలో సర్వే నిర్వహించనున్న ఆరోగ్యశాఖ సిబ్బందికి శిక్షణ అందిస్తారు. ఈ నెలాఖరులోగా క్షేత్రస్థాయి లో సర్వే నిర్వహించే సిబ్బందికి శిక్షణ పూర్తి చేయనున్నట్టు ఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు.

ఎన్‌సీడీ 3.ఓ సర్వేలో పూర్తిగా కేన్సర్‌కు సంబందించిన అంశాలపై దృష్టిసారిస్తారు. ప్రపంచవ్యాప్తంగా కేన్సర్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో కేన్సర్ స్క్రీనింగ్ చేయడానికి అధిక ప్రాధాన్యతనిచ్చేలా ఆదే శాలు అందాయని ఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు.

అదుపు చేయడంపైనే దృష్టి..

ఇటీవల దీర్ఘకాలిక వ్యాదుల బారినపడుతున్న వారి సం ఖ్య గణనీయంగా పెరుగుతోంది. ముఖ్యంగా చిన్న వయసు లోనే షుగర్, బీపీ వంటి సమస్యలు చుట్టుముట్టడం, కేన్సర్ మహమ్మారి విజృంభిస్తుండడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. సకాలంలో కొన్ని దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించడం ద్వారా ప్రాణాపాయం నుంచి రోగులను తప్పించేందుకు అవకాశం ఉంటుంది. ఈ ఉద్దేశంతోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సర్వేను చేపడుతున్నాయి. దీని ద్వారా వీలైనంత వరకు దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడే వారిని ముందుగానే గుర్తించి, మెరుగైన వైద్యసేవలు అందించేం దుకు అవకాశం ఉంటుందని జిల్లా ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జగదీశ్వరరావు తెలిపారు. ఈ సర్వేతో అనారోగ్య సమస్య ఉందని తెలియని ఎంతోమందిని గుర్తించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఆశా, ఏఎన్ఎం, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్, మెడికల్ ఆఫీసర్లకు శిక్షణ ఇచ్చేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నామని డీఎంహెచ్‌వో వివరించారు.